సాక్షి
నల్లగొండ

మంగళవారం ; 10 ; జూన్ ; 2025



పాలిటెక్నిక్‌లో ప్రవేశాలు

కంపాసాగర్‌లోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు ఈనెల 29 నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు. - 8లో



అధ్యక్ష పాలన దిశగా..

దేశంలో అధ్యక్ష పాలన దిశగా బీజేపీ ప్రయత్నిస్తోందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు సాయిబాబా అన్నారు. - 8లో



యాదగిరీశుడి సన్నిధిలో..

యాదగిరి క్షేత్రంతోపాటు కొలనుపాక లోని జైన మందిరాన్ని సోమవారం ట్రైనీ ఐఏఎస్ అధికారులు సందర్శించారు. - 8లో

న్యూస్‌రీల్

కాంగ్రెస్ కమిటీలో అగ్రస్థానం

- ఉపాధ్యక్షులుగా ముగ్గురు
- ప్రధాన కార్యదర్శులుగా ఐదుగురు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కమిటీలో నల్లగొండ జిల్లాకు అగ్రస్థానం దక్కింది. పార్టీ ఉపాధ్యక్ష పదవుల్లో ముగ్గురిని నియమించగా, ప్రధాన కార్యదర్శులు ఐదుగురికి స్థానం లభించింది. ఉపాధ్యక్షులుగా ఎంపీ రఘువీర్‌రెడ్డి, కొండేటి మల్లయ్య, గుమ్ముల మోహన్‌రెడ్డి నియమితులయ్యారు. కొండేటి మల్లయ్య ఇప్పటికే ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. గుమ్ముల మోహన్‌రెడ్డి నల్లగొండ పట్టణ అధ్యక్షుడిగా ఉన్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శులుగా బొజ్జ సంధ్యారెడ్డి, దైద రవీందర్, చనగాని దయాకర్, వి.రామారావుగౌడ్, చకిలం రాజేశ్వర్‌రావుకు అధిష్టానం అవకాశం కల్పించింది. అయితే, ఇందులో గుమ్ముల మోహన్‌రెడ్డి, కొండేటి మల్లయ్య, చనగాని దయాకర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఆశిస్తున్న వారే కావడం గమనార్హం. ఈ నియామకాలతో వారు డీసీసీ అధ్యక్ష పదవికి దూరం అయినట్లేనని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

వినతుల స్వీకరణ



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ : గ్రీవెన్స్‌డే సందర్భంగా సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్ 35 మంది బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. వారితో నేరుగా మాట్లాడి సమస్యను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాధితుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని పోలీసు అధికారులకు సూచించారు. స్టేషన్‌కి వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారించి.. చట్టపరంగా బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని పోలీసులను ఆదేశించారు.

నేటి నుంచి 'అమ్మ మాట - అంగన్‌వాడీ బాట'

నల్లగొండ : 'అమ్మ మాట - అంగన్‌వాడీ బాట' మంగళవారం నుంచి ఈ నెల 17వ తేదీ వరకు నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం ఒక ప్రకటనలో ఆదేశించారు. మూడేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ బడిలో చేర్పించే కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములను చేయాలని పేర్కొన్నారు. 10న అంగన్‌వాడీ కేంద్రాల అలంకరణ, తల్లిదండ్రులు పిల్లలతో సెల్ఫీ దిగడం, 11న ప్రతి ఇంటికి వెళ్లి పిల్లల్ని అంగన్‌వాడీలో చేర్చుకోవడం, 12వ తేదీ నుంచి 16 వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ కిచెన్ గార్డెన్ల అభివృద్ధి, పౌష్టికాహార ప్రాముఖ్యత తెలియజేయడం, 17వ తేదీన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమాలను పండుగ వాతావరణంలో నిర్వహించాలని పేర్కొన్నారు.

హాస్టల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ : ప్రభుత్వ వికలాంగుల బాలుర కళాశాల వసతి గృహంలో దివ్యాంగులు, అంధులు, బధిర విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా, శిశు, వికలాంగుల సంక్షేమ అధికారి కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకునే విద్యార్థుల అర్హత, తదితర వివరాల కోసం 9154759888 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

30వ తేదీ వరకు బియ్యం పంపిణీ

నల్లగొండ : జిల్లాలోని అన్ని రేషన్ దుకాణాల్లో జూన్, జూలై, ఆగస్టు (3 నెలలు)లకు సంబంధించిన సన్న బియ్యాన్ని ఈ నెల 30వ తేదీ వరకు పంపిణీ చేయనున్నట్లు జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్ కార్డుదారులు సన్నబియ్యం పంపిణీ విషయంలో ఎలాంటి ఆందోళన చెందకుండా ఈ నెల 30 వరకు తీసుకోవచ్చని పేర్కొన్నారు.

ఉపకరణాలకు దరఖాస్తులు

నల్లగొండ : శారీరక, బధిర, అంధ, మానసిక దివ్యాంగుల్లో అర్హులైన వారి నుంచి ఉపకరణాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా, శిశు వికలాంగుల సంక్షేమ అధికారి కృష్ణవేణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన దివ్యాంగులు ఈ నెల 18 వరకు ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా bmms.cgg.gov.inలో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. అర్హత, తదితర వివరాలకు 9441032444 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నల్లగొండకేవీ నిధులు!

సాగర్ ఎడమకాల్వ మరమ్మతును పట్టించుకోని ప్రభుత్వం



శెట్టిపాలెం వద్ద లైనింగ్ కొట్టుకుపోయి అధ్వానంగా ఉన్న ఎడమకాల్వ

- ఖమ్మం, సూర్యాపేట జిల్లాలకే నిధులు కేటాయింపు..
- నల్లగొండలో ఆనవాలు కోల్పోతున్న మెయిన్ కెనాల్, మేజర్, మైనర్ కాల్వలు
- సాగునీటి విడుదలపై ప్రభావం



కోతకు గురైన ముల్కలకాల్వ మేజర్

మిర్యాలగూడ : నాగార్జునసాగర్ ఎడమకాల్వ ద్వారా 10.39 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఈ కాల్వ పరిధిలో నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం, ఏపీలోని కృష్ణ, పశ్చిమ గోదావరి జిల్లాలు ఉన్నాయి. నాగార్జునసాగర్ 0 కి.మీ నుంచి ఎడమ కాల్వ పొడవు 179 కి.మీ వరకు విస్తరించి ఉంది. ఈ కాల్వపైన మేజర్లు, మైనర్లు ద్వారా పొలాలకు నీరందుతుంది. లక్షల ఎకరాలకు నీరందించే ఈ కాల్వ మరమ్మతుల విషయంలో ప్రభుత్వం వివక్ష చూపుతోంది. సూర్యాపేట జిల్లాకు చెందిన నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఖమ్మం జిల్లాకు చెందిన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వారి సొంత జిల్లాల పరిధిలో ఎడమకాల్వ మరమ్మతులకు నిధులు విడుదల చేయించుకున్నారు. కానీ.. అసలు కాల్వ మొదటి భాగం అయిన నల్లగొండ జిల్లా పరిధిలో మరమ్మతులకు మాత్రం నిధులు ఇవ్వలేదు. దీంతో నల్లగొండ జిల్లా పరిధిలో మెయిన్ కెనాల్‌తోపాటు మేజర్లు, మైనర్లు ఆనవాలు కోల్పోయే పరిస్థితి దాపురించింది.

చివరి భూములకు అందని నీరు

సాగర్ ఎడమకాల్వకు గతంలో చేపట్టిన ఆధునీకరణలో భాగంగా ఇరువైపులా 90శాతం మేర సీసీ లైనింగ్ చేశారు. కొన్నిచోట్ల వదిలేశారు. ఎడమకాలవకు 14వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయాల్సి ఉంది. కానీ, కట్టలు బలహీనంగా ఉండడంతో 11వేల క్యూసెక్కుల లోపు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ ఎడమకాల్వ కింద మేజర్లు, మైనర్ల పరిధిలో కూడా ఇదే పరిస్థితి ఉంది. నల్లగొండ జిల్లా పరిధిలో ప్రధానంగా వజీరాబాద్, కిష్టాపురం, ముల్కలకాల్వ మేజర్ పరిధిలో కాల్వ కట్టలు బలహీనంగా ఉన్నాయి. సీసీ లైనింగ్ ఏర్పాటు చేయకపోవడంతో నీటి విడుదల కారణంగా కోతకు గురవుతున్నాయి. కాల్వకు పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేయడంలేదు. దీంతో చివరి భూములకు ప్రతి సీజన్‌లో నీరందకుండా పోతోంది. ఈ సీజన్‌లో కూడా అదే పరిస్థితి దాపురించింది.

సూర్యాపేట, ఖమ్మం జిల్లాల పరిధిలో నిధులు..

- ఎడమకాల్వ పరిధిలోని నల్లగొండ మినహా సూర్యాపేట, ఖమ్మం జిల్లాలో ఉన్న కాల్వల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. సూర్యాపేట జిల్లాలో కాల్వల అత్యవసర మరమ్మతుల కోసం రూ.1.26కోట్ల నిధులు కేటాయించారు. కాల్వలో ఇరువైపులా ఉన్న కంపచెట్లు తొలగించి లైనింగ్ ఏర్పాటు చేసి దెబ్బతిన్న తూములకు, షట్టర్లకు మరమ్మతులు చేస్తున్నారు. పెన్‌పహాడ్ మండలం దోసపాడు వద్ద కాల్వ 74కి.మీ నుంచి నడిగూడెం మండలం కాగిత రామచంద్రాపురం రంగుల వంతెన 133కి.మీ వరకు మరమ్మతు పనులు చేస్తున్నారు. ఆ పరిధిలోని 24 మేజర్ కాల్వలు, తూములకు పాత షట్టర్లను తొలగించి కొత్త షట్టర్లను ఏర్పాటు చేస్తున్నారు.
- ఖమ్మం జిల్లాలో ఎడమకాల్వలో ముళ్ల కంప తొలగింపునకు నిధులు మంజూరయ్యాయి. వైరా, పాలేరు, లంకసాగర్ ప్రాజెక్టులకు సంబంధించిన కాల్వలకు శాశ్వత మరమ్మతులు చేపడుతున్నారు. క్రాస్ రెగ్యులేటర్ షట్టర్ల మరమ్మతుకు టెండర్లు పూర్తి చేశారు. ఖమ్మం, కల్లూరు సర్కిల్‌లో 15 ఎత్తిపోతల మరమ్మతులకు 1.50కోట్లు మంజూరయ్యాయి. పాలేరు ప్రధాన కాల్వపై కొట్టుకపోయిన్ అండర్ టన్నెల్ మరమ్మతులకు రూ.14కోట్లు కేటాయించారు.

పొంచి ఉన్న ముప్పు

ఇటీవల మిర్యాలగూడలో ఉమ్మడి జిల్లా నీటి పారుదలపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమీక్షించారు. ఎడమకాల్వ మరమ్మతులకు నిధులు కేటాయిస్తామని పేర్కొన్నప్పటికీ ఇప్పటివరకు ఆ జాడ చేయలేదు. త్వరలోనే సాగర్‌కు వరద నీరు వచ్చి చేరే అవకాశం ఉండగా వానాకాలం సీజన్ పంటలు సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో సాగునీటిని విడుదల చేస్తే ఎడమకాల్వ పరిధిలోని కాల్వకట్టలకు ఎక్కడ, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

ప్రభుత్వానికి ప్రతిపాదించాం

నల్లగొండ జిల్లా పరిధిలో ఎడమకాల్వ, మేజర్లు, మైనర్ల కట్టలకు మరమ్మతులు చేసేందుకు ఎస్టిమేట్లు వేసి ప్రభుత్వానికి ప్రతిపాదించాం. నిధులు మంజూరు కాకపోవడంతో ఈ వేసవిలో పనులు చేపట్టలేకపోయాం. నిధులు మంజూరైతే వెంటనే పనులు ప్రారంభిస్తాం. సూర్యాపేట, ఖమ్మం జిల్లాల పరిధిలో నిధులు మంజూరయ్యాయన్న విషయం మా దృష్టికి రాలేదు. సాగునీరు వృథా కాకుండా, చివరి భూములకు నీరందే విధంగా అన్ని చర్యలు తీసుకుంటాం.

– అజయ్‌కుమార్, ఎస్ఈ, సీఈ



వేములపల్లి : అన్నపరెడ్డిగూడెం తూము వద్ద కోతకు గురైన ఎడమకాల్వ కట్ట



మిర్యాలగూడ మండలం కురియాతండా వద్ద దెబ్బతిన్న ఎడమకాల్వ



ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందుకున్న మహిళలతో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

పది రోజుల్లో భవనాలకు నిధులు

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ

మిర్యాలగూడ : మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సూచనల మేరకు పది రోజుల్లో సబ్ కలెక్టర్, తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు స్థలం కేటాయింపుతోపాటు భవనాల నిర్మాణాలకు నిధులు కేటాయిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, ఆర్‌అండ్‌బీఆర్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీ, భూభారతి చట్టంపై అవగాహన కార్యక్రమంలో భాగంగా జరిగిన బహిరంగ సభలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, నీటిపారుదల శాఖమంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు భవనాల, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి పొంగులేటి మాట్లాడారు. పేదోడి కలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అప్పుల తెలంగాణగా ఉన్న రాష్ట్రాన్ని గాడిలో పెడ్తున్నామని చెప్పారు. ఇంటి స్థలం ఉన్న వారికి నాలుగు విడతల్లో రూ.5లక్షలు చెల్లిస్తామన్నారు. ఇస్తామన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల మాదిరిగానే రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని దీవించాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ప్రొసీడింగ్స్ అందజేశారు.

పేదల అభ్యున్నతే లక్ష్యం

– శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

పేదల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని తెలిపారు. ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లు కట్టించే విధంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. మంజూరు పత్రాలు అందుకునే లబ్ధిదారుల మొఖాలు చూస్తే సంతోషంగా ఉందన్నారు. పేదలందరికీ న్యాయం చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, వేముల వీరేశం, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ పాల్గొన్నారు.

బడిబాట పోస్టర్ ఆవిష్కరణ



బడిబాట పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శాసనమండలి చైర్మన్, మంత్రులు

విద్యాశాఖ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం పోస్టర్, కరపత్రాలను మంత్రులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దీరావత్ ధర్మానాయక్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ రవినాయక్, ఉపాధ్యాయులు కొర్ర కృష్ణకాంత్ నాయక్, తావుర్యా, అనిత, జ్యోతి, ధనలక్ష్మి, స్పందన, భవాని, మీనా, రేణుక పాల్గొన్నారు.



మిర్యాలగూడ జూనియర్ కళాశాల మైదానంలో సభకు హాజరైన ప్రజలు

మున్సిపాలిటీకి మంచి పేరు తేవాలి

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- నీలగిరి మున్సిపల్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ



మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగులతో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : నీలగిరి పట్టణంలో అధికారులు, సిబ్బంది బాధ్యతతో పనిచేసి మున్సిపాలిటీకి మంచి పేరు తేవాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. సోమవారం నీలగిరి మున్సిపల్ కార్యాలయాన్ని మంత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న సమయంలో మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్న మంత్రి ప్రతి విభాగానికి వెళ్లి అక్కడ ఉన్న ఉద్యోగులు, సిబ్బందితో మాట్లాడారు. ఇంజనీరింగ్ విభాగానికి వెళ్లిన మంత్రి అక్కడి ఈఈ, ఏఈలతో పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, వాటి పురోగతి గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంలో సీడీపీ, ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టిన 180 పంచాయతీరాజ్ పనుల్లో నాణ్యత లేవంటూ వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ అమిత్ నారాయణ్‌కు ఫోన్‌లో ఆదేశించారు. రెవెన్యూ విభాగంలో ఆస్తి పన్ను వసూలు, గతంలో జరిగిన అక్రమాలపై ఆరా తీశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయాన్ని సందర్శించారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు నెలనెలా జీతాలు ఇస్తున్నారా.. లేదా అని ఆరాతీశారు. అక్కడ వివిధ రికార్డులను పరిశీలించి అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్డీఓ అశోక్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 68 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ విద్యుత్ వినియోగం లేకుండా, రైతుపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా ఇందిర సౌర గిరి జల వికాస పథకం ఉపయోగపడుతుందని తెలిపారు. గిరిజన ప్రాంతాలైన దేవరకొండ, మిర్యాలగూడ ప్రాంతాల్లోని 14 మండలాల్లో ఈ పథకాన్ని అమలు చేసేందుకు ప్రణాళిక రూపొందించిందని తెలిపారు. 6800 మంది గిరిజనులను ఈ పథకానికి అర్హులుగా గుర్తించామన్నారు. ఆర్ఓఎఫ్ఆర్ కింద గిరిజనులకు పంపిణీ చేసిన భూముల్లో ఈ పథకం కింద సాగు చేసుకునే అవకాశం ఉందని ఆమె వివరించారు. ఆర్ఓఎఫ్ఆర్ పట్టా పొందిన, రెండున్నర ఎకరాల పొలం ఉన్న గిరిజన రైతులకు సోలార్ యూనిట్ ఇస్తారమని తెలిపారు. మొదటి సంవత్సరం జిల్లాలో 270 మంది గిరిజనులకు ఈ పథకం అమలు చేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. అనంతరం ఈసీఐఎల్ ద్వారా దివ్యాంగులకు పంపిణీ చేయనున్న మోటార్ బ్యాటరీ సైకిళ్లు, తదితర అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, జిల్లా ఇన్‌చార్జి రెవెన్యూ అధికారి వై.అశోక్‌రెడ్డి, డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి చత్రు నాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

నల్లగొండ : జిల్లాలో పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. సోమవారం నిర్వహించిన సామాన్యశాస్త్రం పేపర్-1 పరీక్షకు 265 మంది విద్యార్థులు హాజరైనట్లు డీఈఓ భిక్షపతి తెలిపారు.

181 పోలింగ్ కేంద్రాల గుర్తింపు

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ : రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో 1200 మంది ఓటర్లు దాటిన పోలింగ్ కేంద్రాలు 181 గుర్తించినట్లు అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. ఎన్నికల అంశాలపై సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టర్ మాట్లాడుతూ ఖాళీగా ఉన్న బీఎల్ఓ పోస్టులను భర్తీ చేశామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీఓలు అశోక్‌రెడ్డి, రమణారెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (గ్రేడ్-1) వెంకటేశ్వర్లు హాజరయ్యారు.

జీపీఓలు ఎప్పుడొస్తరో!

- గ్రామ పాలనాధికారుల నియామకంపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం
- ఎదురుచూపుల్లో పరీక్ష రాసిన అభ్యర్థులు



నల్లగొండ : రెవెన్యూ వ్యవస్థకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం గ్రామ పాలన అధికారులను (జీపీఓ) నియమించాలని నిర్ణయించింది. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్ఓ, వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేయడంతో వీఆర్ఓలుగా పనిచేసిన వారిని ఇతర ప్రభుత్వ శాఖలకు బదలాయించిన విషయం తెలిసిందే. అయితే ఆ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణిని ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసి.. భూ భారతిని తీసుకొచ్చింది. అందులో భాగంగానే రెవెన్యూ వ్యవస్థకు మళ్లీ పూర్వ వైభవం తెచ్చేందుకు రెవెన్యూ శాఖ నుంచి ఇతర శాఖలకు వెళ్లిన వీఆర్ఓలు తిరిగి రెవెన్యూ శాఖకు వచ్చే వారి నుంచి దరఖాస్తులు కోరిన విషయం తెలిసిందే. అయితే వారికి పరీక్షలు నిర్వహించి ఫలితాలు వెల్లడించినా.. నియామకాలపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు.

పరీక్షలో 184 మంది అర్హత

రెవిన్యూ శాఖ నుంచి ఇతర శాఖలకు వెళ్లిన వారు తిరిగి రెవెన్యూ శాఖకు వచ్చేందుకు 241 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిని ఆ శాఖలోకి నేరుగా తీసుకోకుండా మే 27న పరీక్ష నిర్వహించింది. అందులో 241 మందికి గాను 184 మంది మాత్రమే అర్హత సాధించారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు


తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం భూ భారతిని ప్రారంభించింది. 3వ తేదీ నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోంది. ఆయా గ్రామాల్లో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. అయితే అదే రోజున గ్రామ పాలన అధికారులను కూడా నియమిస్తుందని అంతా భావించారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటనా రాకపోవడంతో.. పరీక్షలో అర్హత సాధించిన వారంతా ఎదురుచూపుల్లోనే ఉన్నారు.

జిల్లాలో 566 రెవెన్యూ గ్రామాలు..

జిల్లాలో మొత్తం 566 రెవిన్యూ గ్రామాలున్నాయి. అయితే ప్రభుత్వం ప్రతి గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమిస్తామని ప్రభుత్వం అప్పట్లో చెప్పింది. కానీ 184 మంది మాత్రమే పరీక్షలో అర్హత సాధించారు. అంటే ప్రభుత్వం అన్ని గ్రామాలకు జీపీఓలను నియమించాలంటే గతంలో జూనియర్ అసిస్టెంట్లుగా ఇతర శాఖల్లోకి వెళ్లిన వారిని తిరిగి నేరుగా తీసుకుని భర్తీ చేస్తుందా.. లేక నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేస్తుందా అనే విషయంలో కూడా స్పష్టత లేదు. లేదా కొన్ని రెవెన్యూ గ్రామాలను క్లస్టర్లుగా ఏర్పాటు చేసి.. ఆ క్లస్టర్‌కు ఒక జీపీఓను నియమిస్తుందా అన్న చర్చ సాగుతోంది.

సమస్యలపై ప్రశ్నించేది కమ్యూనిస్టులే..

- ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సత్యం

చింతపల్లి : ప్రజా సమస్యలపై నిత్యం ప్రభుత్వాలను ప్రశ్నించేది కమ్యూనిస్టులేనని సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. సోమవారం చింతపల్లి మండల పరిధిలోని మాల్ వెంకటేశ్వర నగర్‌లో నిర్వహించిన సీపీఐ 14వ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. మొదటి శత్రువు ముస్లింలు, రెండవ శత్రువు క్రైస్తవులు, మూడవ శత్రువు కమ్యూనిస్టులు అంటూ బీజేపీ నాయకులు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల నుంచి బయటకు రావడం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇబ్బందిగా మారిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిందని వాటిని అమలు చేయాలన్నారు. ప్రభుత్వం నిష్పక్షపాతంగా పేదలకు సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, పల్లా దేవేందర్‌రెడ్డి, అంజయ్యనాయక్, కలకొండ కాంతయ్య, ఉజ్జిని యుగేందర్‌రావు, పోలె వెంకటయ్య, ఉజ్జిని అంజల్‌రావు, చెల్లం పాండురంగారావు, కొలుకులపల్లి కొండలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుక్కల దాడిలో కృష్ణ జింక మృతి



మృతిచెందిన కృష్ణ జింక

గట్టుప్పల్: కుక్కల దాడిలో కృష్ణ జింక మృతిచెందింది. ఈ ఘటన గట్టుప్పల్ మండల పరిధిలోని నామాపురం గ్రామ శివారులో సోమవారం ఉదయం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నామాపురం గ్రామ శివారులోని ఓ రైతు వ్యవసాయ క్షేత్రం సమీపంలో గడ్డి మేస్తున్న కృష్ణ జింకను కుక్కలు వెంటాడి చంపాయి. సమీపంలోని రైతులు గమనించి కృష్ణ జింకను విడిపించే ప్రయత్నం చేయగా.. కుక్కలు రైతుల వెంటపడడంతో వారు తప్పించుకున్నారు. అటవీశాఖ అధికారులు ప్రభుత్వ భూమిని గుర్తించి జింకల పార్కు ఏర్పాటు చేయాలని మాజీ సర్పంచ్ కంచుకట్ల సంపత్, ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి కన్వీనర్ కంచుకట్ల సుభాష్, భీమనపల్లి రాములు డిమాండ్ చేస్తున్నారు.

బాలుడికి గాయాలు..

నేరేడుచర్ల: కుక్కల దాడిలో బాలుడు గాయపడిన ఘటన సోమవారం నేరేడుచర్ల మున్సిపాలిటీలో చోటు చేసుకుంది. నేరేడుచర్ల మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన రావిరాల మన్విత్ బంధువుల వివాహానికి హాజరయ్యేందుకు కుటుంబ సభ్యులతో కలిసి నేరేడుచర్ల మున్సిపాలిటీలోని చింతబండకు వచ్చాడు. బంధువుల ఇంటి వద్ద పిల్లలతో కలిసి మన్విత్ ఆడుకుంటుండగా.. కుక్కలు ఒక్కసారిగా అతడిపై దాడి చేయడంతో కాలుకు తీవ్ర గాయమైంది. వెంటనే మన్విత్‌ను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి పున్న నాగిని తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం



నర్సిరెడ్డి (ఫైల్)

వలిగొండ: రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన వలిగొండ మండలం ముద్దాపురం గ్రామంలో ఆదివారం సాయంత్రం జరిగింది. సోమవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముద్దాపురం గ్రామానికి చెందిన సోలిపురం నర్సిరెడ్డి(55) ఆదివారం సాయంత్రం తన ఇంటి నుంచి వ్యవసాయ బావి వద్దకు తొర్రూరు–వలిగొండ రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తుండగా.. వెనుక నుంచి అతివేగంగా లారీ వచ్చి అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నర్సిరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం తెలుసుకున్న నర్సిరెడ్డి కుటుంబ సభ్యులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని అతడిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. సోమవారం మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యుగంధర్ తెలిపారు.

‘వ్యవసాయ పాలిటెక్నిక్’లో ప్రవేశాలు

- ఆన్‌లైన్‌లో దరఖాస్తునకు ఈ నెల 29 వరకు గడువు
- పదో తరగతి మార్కులు, పాలిసెట్ ర్యాంక్ ఆధారంగా ఎంపిక

త్రిపురారం: అగ్రికల్చర్ డిప్లొమా చేయాలనుకునే విద్యార్థుల కోసం హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో గల ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా త్రిపురారం మండలం కంపాసాగర్‌లో గల వ్యవసాయ పరిశోధనా స్థానంలో పాలిటెక్నిక్ కళాశాలను 2007లో ప్రారంభించారు. పదో తరగతి ఉత్తీర్ణులై, అగ్రికల్చర్ విభాగంలో పాలిసెట్–2025లో ర్యాంకు సాధించిన విద్యార్థులు వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలల్లో చేరేందుకు గాను ఈ నెల 29వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హతలు :

దరఖాస్తు చేసుకునే వారి వయస్సు 2024 డిసెంబర్ 31 నాటికి 15 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి 22 ఏళ్లు. పదో తరగతిలో వచ్చిన మార్కులు, పాలిసెట్‌లో వచ్చిన ర్యాంకు ఆధారంగా ఎంపిక ఉంటుంది. రిజర్వేషన్ల ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తారు. అర్హత సాధించిన వారికి మాత్రమే సమాచారం అందిస్తారు. వివరాలకు www.pjtsau.edu.in వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు. డిప్లొమా ఇన్ అగ్రికల్చర్, డిప్లొమా ఇన్ ఆర్గానిక్ అగ్రికల్చర్ కోర్సుల వ్యవధి రెండేళ్లు కాగా.. డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ కోర్సు వ్యవధి మూడేళ్లు ఉంటుంది. కంపాసాగర్ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో 20 సీట్లు అందుబాటులో ఉన్నాయి.



కంపాసాగర్‌లోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల

- దరఖాస్తు ఫీజు : దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600, ఇతర అభ్యర్థులకు రూ.1200,
- ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లింపునకు చివరి తేదీ : జూన్ 28
- ఆన్‌లైన్ దరఖాస్తు సమర్పించేందుకు చివరి తేదీ : జూన్ 29
- దరఖాస్తులు తప్పుల సవరణకు చివరి తేదీ : జూన్ 30

యూనివర్సిటీ నిబంధనల ప్రకారం ఎంపిక

విద్యార్థుల ఎంపిక యూనివర్సిటీ పరిధిలో ఉంటుంది. కంపాసాగర్ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు ప్రశాంత వాతావరణంలో విద్యా బోధన ఉంటుంది. విద్యార్థులు వ్యవసాయ శాస్త్రవేత్తలతో కలిసి వ్యవసాయంలో పాటించాల్సిన పద్ధతులపై క్షేత్రస్థాయిలో మెళకువలు నేర్చుకుంటారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

– డాక్టర్ లింగయ్య, ప్రధాన శాస్త్రవేత్త, కంపాసాగర్ వ్యవసాయ పరిశోధనా స్థానం

బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకొని తీరుతాం

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే బీఎల్ఆర్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

మిర్యాలగూడ: గోదావరిపై ఏపీ ప్రభుత్వం నిర్మించే బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకొని తీరుతామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ ప్రాజెక్టు విషయంపై కోర్టుకు వెళ్తామని, కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరంపై విచారణ కమిటీ ముందు హరీష్‌రావు అన్ని అబద్ధాలు చెప్పారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల అధికారంలో ఉండి ఒక్క మంచి పని కూడా చేయలేదన్నారు. రాష్ట్రానికి కేసీఆర్ అప్పులు మిగిల్చిపోయాడని, కాంగ్రెస్ ప్రభుత్వం 16నెలల కాలంలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముందుకు పోతుందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం పథకానికి ఇటీవల రూ.5వేల కోట్లను ఆర్టీసీకి చెల్లించామని తెలిపారు. రూ.22వేల కోట్లతో అన్ని నియోజకవర్గాల కేంద్రాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పేదల కడుపు నింపేందుకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, దీని ద్వారా ప్రభుత్వానికి రూ.5వేల కోట్ల భారం పడిందన్నారు. రాబోయే మూడేళ్లలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి చేసి ఉమ్మడి నల్లగొండ జిల్లాకు నీళ్లు అందిస్తామన్నారు. కేసీఆర్ దేవుడని, ఆయన చుట్టూ దయ్యాలు ఉన్నాయని కవిత చెప్పిందని, ఆ దయ్యాలెవరో ఇంతవరకు బయటకు రాలేదన్నారు.

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య



దివ్య మృతదేహం

మిర్యాలగూడ టౌన్ : భర్త మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని వేధిస్తుండడంతో.. మనస్తాపానికి గురైన వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన సోమవారం మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని జంకుతండాకు చెందిన బుడిగపాక నరేష్, శోభ దంపతుల కుమార్తె దివ్య (23) మిర్యాలగూడ పట్టణంలోని ఓ షాపింగ్ మాల్‌లో పనిచేస్తుండగా.. యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన బొంత నాగరాజు, లక్ష్మి దంపతుల కుమారుడు బొంత వెంకటేష్‌తో పరిచయం ఏర్పడింది. వీరి పరిచయం ప్రేమగా మారడంతో ఇరువురు వివాహం చేసుకున్నారు. వీరికి కుమార్తె లాస్య, కుమారుడు తరుణ్‌కుమార్ ఉన్నారు. అయితే గత రెండేళ్లుగా యాద్గార్‌పల్లి గ్రామానికే చెందిన మహిళతో వెంకటేష్ వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయం తెలిసి దివ్య భర్తను నిలదీసింది. దీంతో ‘నీవు కట్నం ఏమైనా తెచ్చావా.. నీవు తక్కువ కులం దానివి’ అంటూ దివ్యను కొంతకాలంగా వెంకటేష్ వేధింపులకు గురిచేస్తున్నాడు. ఇదే విషయమై సోమవారం భార్యాభర్తల మధ్య మరో సారి గొడవ జరగడంతో మనస్తాపానికి గురైన దివ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ మల్లికంటి లక్ష్మయ్య తెలిపారు.

గుర్తుతెలియని యాచకుడి మృతదేహం లభ్యం



యాదగిరిగుట్ట రూరల్ : యాదగిరిగుట్ట–మల్లాపురం రహదారిలో సోమవారం గుర్తుతెలియని యాచకుడి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట పరిధిలో భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్న సుమారు 65 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి సోమవారం యాదగిరిగుట్ట–మల్లాపురం రహదారిలో ఎస్సార్ పెట్రోల్ బంక్ వద్ద ఆవుల కృష్ణకు చెందిన పశువుల కొట్టం వద్ద విగతజీవిగా పడి ఉన్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కేసు పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యాదగిరీశుడి సన్నిధిలో ట్రైనీ ఐఏఎస్ అధికారులు



యాదగిరిగుట్ట: స్వామివారిని దర్శించుకున్న ట్రైనీ ఐఏఎస్ అధికారులు



ఆలేరురూరల్: కొలనుపాకలోని జైన మందిరం వద్ద ట్రైనీ ఐఏఎస్ అధికారులు

యాదగిరిగుట్ట: హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో శిక్షణ పొందుతున్న 2024 బ్యాచ్‌కు చెందిన ట్రైనీ ఐఏఎస్ అధికారులు సౌరబ్ శర్మ, సలోని ఛబ్రా, హర్ష చౌదరి, కరోలిన్ చింగ్తియన్మయి, కొయ్యడ ప్రణయ్‌కుమార్ సోమవారం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు సంప్రదాయంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తుల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. వారికి అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు. అంతకుముందు ట్రైనీ ఐఏఎస్ అధికారులకు ఆర్డీఓ కృష్ణారెడ్డి, తహసీల్దార్ గణేష్ స్వాగతం పలికారు.

జైన మందిరంలో పూజలు..

ఆలేరురూరల్: ఆలేరు మండలం కొలనుపాకలోని జైన మందిరం, సోమేశ్వరాలయాన్ని కూడా ట్రైనీ ఐఏఎస్ అధికారులు సందర్శించారు. ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి పరిసరాలను పరిశీలించారు. వారి వెంట ఆర్డీఓ తదితరులు ఉన్నారు.

కోతుల దాడి.. వృద్ధుడికి తీవ్ర గాయాలు



గాయపడిన భిక్షమయ్య

మోత్కూరు : కోతుల దాడిలో వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మోత్కూరు మండలం పాలడుగు గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. బాధితుడు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలడుగు గ్రామానికి చెందిన కొంపెల్లి భిక్షమయ్య (75) తన ఇంటి ఆవరణలో పనులు చేసుకుంటుండగా ఒక్కసారిగా కోతుల గుంపు వచ్చి అతడిపై దాడికి పాల్పడ్డాయి. అతడి కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. భిక్షమయ్య కుటుంబ సభ్యులు గమనించి కోతులను తరిమేసి అతడిని మోత్కూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నల్లగొండ జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. కొన్నిరోజులుగా గ్రామంలో కోతుల సంచారం పెరగడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని, కోతుల బెడద నుంచి రక్షించాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

పాముకాటుకు గురై మహిళ మృతి

వలిగొండ: పాముకాటుకు గురై మహిళ మృతి చెందింది. ఈ ఘటన వలిగొండ మండలం గుర్నాథపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్నాథపల్లి గ్రామానికి చెందిన తోట జయమ్మ(65) ఆదివారం రాత్రి ఆరుబయట నిద్రించగా.. రాత్రి 10గంటల సమయంలో ఆమెను పాము కాటేసింది. వెంటనే ఆమెను కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యుగంధర్ తెలిపారు.

పెట్రోల్ కొట్టిస్తే నీళ్లు వచ్చాయని..

- బంక్ ఎదుట వినియోగదారుడి నిరసన

చౌటుప్పల్ రూరల్: ద్విచక్ర వాహనంలో పెట్రోల్ కొట్టించుకుంటే నీళ్లు వచ్చాయని ద్విచక్ర వాహనదారుడు బంక్ ఎదుట నిరసన వ్యక్తం చేశాడు. ఈ ఘటన చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామ స్టేజీ వద్ద గల ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో సోమవారం సాయంత్రం జరిగింది. చౌటుప్పల్ మండలం ఆరెగూడేనికి చెందిన పిన్నింటి కరుణాకర్‌రెడ్డి పంతంగి గ్రామ స్టేజీ వద్ద గల ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో తన ద్విచక్ర వాహనంలో పెట్రోల్ పోయించుకుని ఇంటికి వెళ్తుండగా మధ్యలో బైక్ ఆగిపోయింది. అనుమానం వచ్చి బైక్ నుంచి పెట్రోల్ తీసి చూడగా నీళ్లు వచ్చాయి. వెంటనే బంక్ వద్దకు వెళ్లి సిబ్బందిని ప్రశ్నించాడు. మరో సీసాలో పెట్రోల్ కొట్టించి చూడగా అందులో కూడా పెట్రోల్ కంటే నీళ్లే ఎక్కువగా వచ్చాయి. ఇదేమిటని బంక్ మేనేజర్ రామకృష్ణను కరుణాకర్‌రెడ్డి నిలదీయగా.. అతడు సమాధానం చెప్పకుండా వెళ్లిపోయాడు. దీంతో జిల్లా పౌర సరఫరాల అధికారి(డీసీఎస్ఓ) రోజాకు ఫిర్యాదు చేశాడు.

తనిఖీ చేసి చర్యలు తీసుకుంటాం..

బాధితుడి ఫిర్యాదు మేరకు పెట్రోల్ బంక్‌లో డెన్సిటీ చెక్ చేస్తామని డీసీఎస్ఓ రోజా తెలిపారు. పెట్రోల్‌లో ఇథనాల్ కలుస్తుడడం వల్ల నీటి తేమ వచ్చినా కూడా ట్యాంక్‌లో ఉన్న పెట్రోల్ నీళ్లలా మారుతుంది. బంక్ యజమాన్యం ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని చెప్తూనే ఉన్నాం. వినియోగదారులను కల్తీ పెట్రోల్ అమ్మితే బంక్ సీజ్ చేస్తాం.

అన్నివర్గాల మద్దతుతోనే ఎస్సీ వర్గీకరణ

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ

చిట్యాల: అన్ని వర్గాలు, రాజకీయ పార్టీల మద్దతుతోనే రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ అన్నారు. చిట్యాలలో సోమవారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ మండల స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మంద కృష్ణమాదిగ నాయకత్వంలో మూడు దశాబ్దాలుగా చేసిన రాజీలేని పోరాటంతో చివరికి విజయం దక్కిందన్నారు. ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా ఏర్పాటైన ఎమ్మార్పీఎస్ అన్ని వర్గాల సంక్షేమం కోసం అనేక పోరాటాలు చేసిందన్నారు. ఫలితంగానే మంద కృష్ణమాదిగను భారత ప్రభుత్వం పద్మశ్రీతో సత్కరించిందని అన్నారు. ఈ సమావేశంలో మాదిగ జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు గాదె రమేష్, ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు మేడి శంకర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎరసాని గోపాల్, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు నోముల పురుషోత్తం, జీడిమెట్ల రవీందర్, కావలి కృష్ణ, జోగు ప్రవీణ్, మేడి లింగస్వామి, మేడి నర్సింహ, జనగాం అర్జున్, రుద్రవరం లింగస్వామి, మేడి ధనుంజయ పాల్గొన్నారు.

అధ్యక్ష పాలన దిశగా బీజేపీ ప్రయత్నాలు

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు సాయిబాబా



మాట్లాడుతున్న సాయిబాబా

యాదగిరిగుట్ట: అమెరికా తరహాలో మన దేశంలోనూ అధ్యక్ష పాలన దిశగా బీజేపీ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎం. సాయిబాబా అన్నారు. సోమవారం యాదగిరిగుట్టలోని లక్ష్మీనరసింహ ఫంక్షన్‌హాల్‌లో ప్రారంభమైన సీపీఎం జిల్లా రాజకీయ శిక్షణ తరగతులకు ఆయన హాజరై మాట్లాడారు. భారతదేశానికి రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేయాలని బీజేపీ కుట్ర పన్నుతోందన్నారు. బీజేపీ విధానాలను తిప్పికొట్టాలని అన్నారు. దేశంలో ఇప్పటివరకు 14 మంది ప్రధాన మంత్రులు రూ.50లక్షల కోట్ల అప్పు చేస్తే నరేంద్ర మోదీ ఒక్కరే రూ.170 లక్షల కోట్ల అప్పు చేశారని విమర్శించారు. మన దేశం ఆకలి సూచీలో ప్రపంచంలోనే 104 స్థానంలో ఉందని, దీనిని అభివృద్ధి అనాలి అని ప్రశ్నించారు. మోదీ ప్రధాని కాక ముందు దేశంలో 100 మంది కోటీశ్వరులు ఉంటే ఇప్పుడు 200మంది అయ్యారని దుయ్యబట్టారు. మోదీ పేదల సంక్షేమంపై దృష్టి పెట్టలేదన్నారు. భద్రతా లోపం వల్లే పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో 21 మంది అమాయకులైన ప్రజలు ప్రాణాలు కోల్పోయారన్నారు. మహిళలపై దాడులు జరుగుతున్నా కేంద్రం మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. శిక్షణ తరగతులకు ముందు పార్టీ మండల కార్యదర్శి బబ్బూరి పోశెట్టి పార్టీ జెండాను ఎగురవేశారు. పట్టణ కార్యదర్శి సూకల భాస్కర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎండీ. జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నరసింహ, బట్టుపల్లి అనురాధ, కార్యదర్శివర్గ సభ్యులు కల్లూరి మల్లేశం, దాసరి పాండు, జెల్లెల పెంటయ్య, బూరుగు కృష్ణారెడ్డి, గుంటోజు శ్రీనివాసచారి పాల్గొన్నారు.

మట్టపల్లిలో నిత్య కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో సోమవారం శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అదేవిధంగా క్షేత్రంలోని శివాలయంలో శ్రీపార్వతీ రామలింగేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో నవీన్‌కుమార్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఆలేరు: రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం ఆలేరు మండల కేంద్రం పరిధిలో జరిగింది. భువనగిరి రైల్వే హెడ్ కానిస్టేబుల్ కృష్ణారావు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం 11.50గంటల సమయంలో ఆలేరు మండల కేంద్రం పరిధిలోని రైలు పట్టాలపై సుమారు 55 ఏళ్ల వయస్సున్న గుర్తుతెలియని వ్యక్తి ఉంటాన్ని వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు లోకోపైలట్ గమనించి హారన్ కొట్టగా.. అతడి నుంచి స్పందన లేదు. దీంతో రైలు అతడిని ఢీకొట్టడంతో మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. సదరు వ్యక్తి ట్రాక్ దాటుతూ కిందపడటం వల్ల ఈ ఘటన జరిగిందా..? లేదా ఆత్మహత్యకు పాల్పడ్డాడా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. మృతుడు తెల్లటి గీతలు కలిగిన ఎరుపు రంగు షర్ట్ ధరించాడని, మృతదేహాన్ని ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని చెప్పారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 9848222169 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

జంతు కళేబరాలు తరలిస్తున్న వాహనం పట్టివేత

నార్కట్‌పల్లి: పశువుల కళేబరాలు తరలిస్తున్న డీసీఎంను నార్కట్‌పల్లి మండలం గోపలాయపల్లి సమీపంలో సోమవారం స్థానికులు అడ్డుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని తణుకు నుంచి హైదరాబాద్‌కు డీసీఎంలో పశువుల కళేబరాలు తరలిస్తుండగా.. నార్కట్‌పల్లి మండలం గోపలాయపల్లి వారిజాల వేణుగోపాలస్వామి ఆలయ ఆర్చి వద్దకు రాగానే దుర్వాసన వస్తుండటంతో స్థానికులు అడ్డుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు డీసీఎంను పరిశీలించారు. అన్ని అనుమతులు తీసుకునే పశువుల కళేబరాలను సబ్బుల కంపెనీలకు తరలిస్తున్నట్లు గుర్తించామని నార్కట్‌పల్లి ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.

పశుగ్రాసం సాగులో మెళకువలు

పాడిపంట



పెద్దవూర: పశుగ్రాసం అంటే రైతులకు గుర్తుకొచ్చేది జొన్న, వరి, సజ్జ తదితర తృణధాన్యాలు. వీటిలో పశువులకు కావాల్సిన పోషకాలు లభించవు. పైగా వీటి సాగుకు ఖర్చు అధికంగా ఉంటుంది. అయితే శాస్త్రీయ పద్ధతిలో పశుగ్రాసం సాగు చేస్తే ఖర్చు తగ్గించవచ్చని పెద్దవూర మండల పశువైద్యాధికారి డాక్టర్ నులక నాగార్జున్‌రెడ్డి చెబుతున్నారు. డెయిరీ ఫాంల నిర్వహణ వ్యయంలో 70శాతం వరకు పశువుల మేతకే సరిపోతుందని, మేత ఖర్చును తగ్గిస్తే లాభాలు పెంచుకునే అవకాశం ఉందని ఆయన అంటున్నారు. పాల శీతలీకరణ అధికారులు పాలు సప్లై చేసే రైతులకు 50 శాతం సబ్సిడీపై, అదేవిధంగా పశుసంవర్ధకశాఖ అధికారులు సైతం 50శాతం రాయితీపై పాడి రైతులకు విత్తనాలు ఇస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకుని పశుగ్రాసం సాగు చేస్తే గడ్డి కొరత తీరుతుందని ఆయన సూచిస్తున్నారు.

పశుగ్రాసం సాగు చేసే విధానం

- పశుగ్రాసం విత్తనాల్లో ప్రధానమైనవి సూపర్ నైపర్, కో1, కో 2, ఎస్ఎస్‌జీ–825 రకాలు.
- 85శాతం పచ్చిమేతను ఈ రకాల ద్వారా తీర్చుకోవచ్చు.
- ఒకసారి నాటితే 4 నుంచి 5 ఏళ్ల వరకు దిగుబడులు పొందవచ్చు.
- జనవరి నుంచి ఆగస్టు నెల వరకు విత్తనాలు విత్తుకోవచ్చు.
- అన్ని రకాల నేలల్లో సాగు చేసుకోవచ్చు. ఆమ్ల గుణాలు గల నేలల్లో అధిక దిగుబడి ఉంటుంది.
- పశుగ్రాసాల సాగుకు ప్రత్యేకంగా స్థలం కేటాయించలేని వారు తోటలు, కూరగాయ పంటల్లో అంతర పంటగా సాగు చేసుకోవచ్చు.
- ఎకరాకు 16 నుంచి 20 కిలోల విత్తనం అవసరం మిశ్రమ పంటగా కూడా సాగు చేసుకోవచ్చు.
- దుక్కిలో 4 నుంచి 5 టన్నుల కంపోస్టు ఎరువు, 22 కిలోల యూరియా, 16 నుంచి 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలి.
- విత్తిన 45 రోజుల తర్వాత ఎకరాకు 22 కిలోల యూరియా వేయాలి. ఎకరానికి 20 టన్నుల దిగుబడి వస్తుంది.
- అధిక విస్తీర్ణంలో సాగు చేసి సైలేజీ లేదా ఎండి గడ్డి రూపంలో నిల్వ చేసి వాడుకోవచ్చు.

పాల దిగుబడి ఎక్కువే..

పశుగ్రాసం సాగుకు తక్కువ శ్రమ, పెట్టుబడి అవసరం అవుతుంది. విత్తనాలు నాటిన కొద్ది రోజుల్లోనే పశుగ్రాసం కోతకు వస్తుంది. పచ్చి మేత రుచికరంగా ఉండటం వలన పశువులు ఇష్టంగా తింటాయి. సులభంగా జీర్ణం చేసుకుంటాయి. పచ్చి మేత వలన పాల దిగుబడులు 25 శాతం వరకు పెరుగుతుంది. పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుంది. దాణా అవసరం లేకుండా కేవలం పచ్చి మేత ద్వారా 5 నుంచి 6లీటర్ల పాల దిగుబడి సాధించవచ్చు. పచ్చి మేతలో కాల్షియం, భాస్వరం వంటి మాంసకత్తులతో పాటు ఏ, డీ, ఈ విటమిన్లు, పిండి, కొవ్వు పదార్థాలు అధికంగా ఉంటాయి. నీరు తక్కువగా ఉన్న ప్రాంతాల్లోనూ పశుగ్రాసాలను సాగు చేసుకోవచ్చు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



నకిరేకల్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు

నకిరేకల్ : నకిరేకల్ పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను సోమవారం రాత్రి విత్తన స్క్వాడ్ బృందం తనిఖీలు నిర్వహించింది. షాపుల్లో నిర్వహించే స్టాక్ రికార్డులు, బిల్ బుక్‌లు, ఇన్ అవుట్ రిజిస్టర్లను పరిశీలించింది. ఈ సందర్భంగా మునుగోడు ఏడీఏ వేణుగోపాల్, నకిరేకల్ ఇన్‌చార్జి ఏడీఏ జానిమియా మాట్లాడుతూ విత్తన అమ్మకాల్లో డీలర్లు ఉద్దేశపూర్వకంగా అవకతవకలకు పాల్పడితే విత్తన నియంత్రణ చట్టం ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. వారి వెంట డీలర్ల సంతోష్, నాతి సైదులు, పన్నాల శేఖర్‌రెడ్డి, తీపిరెడ్డి ఇంద్రారెడ్డి, సామ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వైభవంగా నమ్మాళ్వార్ తిరునక్షత్ర వేడుక

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం నమ్మాళ్వార్ తిరునక్షత్ర వేడుకను ఆలయ అర్చకులు పాంచరాత్ర ఆగమశాస్త్రానుసారంగా వైభవంగా నిర్వహించారు. ఉదయం స్నపనం చేపట్టిన అర్చకులు, రాత్రి ఆళ్వారు సేవలను తిరు, మాఢ వీధుల్లో ఊరేగించారు. భక్తులు ఈ సేవలో పాల్గొని, ఆధ్యాత్మిక చింతన పొందారు. నమ్మాళ్వార్ల తిరునక్షత్ర విశిష్టతను ఆలయ ముఖ మండపంలో అర్చకులు భక్తులకు వివరించారు. సేవకు ముందు పారాయణీకులు నమ్మాళ్వార్లకు పారాయణం పఠించారు. ఈ వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, అర్చక బృందం, భక్తులు పాల్గొన్నారు.